ఖుర్‌ఆన్, మన ప్రవక్త, వారి అనుచరులు మరియు మన మహాత్ముల విజ్ఞాన వాహకం

మాస పత్రిక

పైగామ్ ఎ హిదాయత్

(దైవసందేశం)

VOLUME 1 ISSUE 12 DECEMBER 2013

సంపాదకులు

ముహమ్మద్ ఉమర్ ఫారూఖ్

పర్యవేక్షకులు

మౌలానా ముహమ్మద్ అబ్దుల్ ఖవీ సాహబ్

నాజిమ్, ఇదారా అప్రఫుల్ ఉలూమ్

చందా వివరాలు

సంచిక వెల - రూ 20/- సంవత్సర చందా - రూ 200/-

ఎకౌంట్ పేరు: MOHD ABDUL QAVI, ఎకౌంట్ నెంబర్: 035210011034204

బాంక్ మరియు బ్రాంచ్: ANDHRA BANK, MALAKPET BRANCH

నేను, ముహమ్మద్ అబ్దుల్ ఖవీ, ప్రింట్ లైన్ ప్రింటర్స్ నుండి ఈ పత్రికను ముద్రించి ఇదారా అప్రఫుల్ ఉలూమ్ ట్రస్ట్, హైదరాబాదు తరుపున ప్రవేశ పెడుతున్నాను.

Published at:17-1-391/M/13, Khaja Bagh Colony, Saidabad, Hyderabad - 59. Phone: 040-24070681 Fax: 040-24071131: 7702234385

www.idara.info E-mail: paigamehidayath@yahoo.com

విషయ సూచిక

1.	సంపాదకీయం	ముహమ్మద్ అబ్దుల్ ఖవీ	3
2.	అల్లాహ్ యొక్క ప్రవచనాలు	ముఫ్తీ తకీ ఉస్మానీ సాహబ్	8
3.	హదీసు పరిమళం	మౌలానా మంజూర్ నోమానీ రెహ్	11
4.	లంచం	ముహమ్మద్ అబ్దుల్ ఖవీ	13
5.	ఇస్లామీ చరిత్ర-8		19
6.	మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి జీవిత చరిత్ర	ముహమ్మద్ అబ్దుల్ ఖవీ	20
7.	అకాయిదె ఇస్లాం (తెలుగులో)		23
8.	దర్సె ఖుర్ఆన్	ముఫ్తీ తకీ ఉస్మానీ సాహబ్	26
9.	జికిరె హబీబ్	ముహమ్మద్ అబ్దుల్ ఖవీ	29
10.	ఔలాద్ కీ తర్బియత్...	ముఫ్తీ ఎహ్మద్ అలీ కాస్మీ	32
11.	అకాయిదె ఇస్లాం (ఉర్దూలో)		

ఇప్పుడు చందా దారుల సులభంగా తమ చందాను క్రింద ఇవ్వబడిన బాంకు ఖాతాలో జమ చేయవచ్చు

Name of the account holder: MOHD ABDUL QAVI

Name of the Bank & Branch: ANDHRA BANK, MALAKPET

Account Number: 035210011034204

ఉత్తర ప్రత్యుత్తరాల కొరకు చిరునామా

ముహమ్మద్ ఉమర్ ఫారూఖ్, 17-1-391/2k/11, ఖాజా బాగ్ కాలనీ, సయీదాబాదు, హైదరాబాదు - 500059. ఫోను నం. 7702234385

సంపాదకీయం

మన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లమ్) గారి సీరత్ మరియు వారి సీరత్ పేరు మీద జరుగుతున్న ఉత్సవాలు

మీలాద్-ఉన్-నబీ

ప్రతీ సంవత్సరం లాగానే ఈ సంవతత్సరం కూడా రబియుల్ అవ్వల్ మొదలవ్వగానే ప్రతీ చోట సీరతె నబీ లేక మీలాదున్నబీ పేరున ఉత్సవాల జోరు మొదలవ్వుతుంది. హైదరాబాదులో ఈ ఉత్సవాల పరంపర రెండు మూడు దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది. ఇంతకు ముందు ఉన్న ఆసఫీ ప్రభుత్వ రోజుల్లో, యౌమె అఫ్జలుల్ అంబియా పేరుతో 12 రబీయుల్ అవ్వల్ రోజున పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించేవారు. ఇందులో ఆ నాటి పరిపాలకుడు అయిన మీర్ ఉస్మాన్ అలీ ఖాన్, మత పెద్దలు మరియు పండితులు పాల్గొనేవారు. ఈ నాటికీ కొన్ని ధార్మిక సంస్థలు మరియు రాజకీయ సంఘాలు ప్రజలను ఆకర్షించడానికి అటువంటి కార్యక్రమాలు జరుపుతూ ఉంటారు. అలాగే కొన్ని సంస్థలు మంచి ఉద్దేశ్యంతో ప్రజల వద్దకు మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి చరిత్రను తీసుకువెళ్ళే ఉద్దేశ్యంతో మరియు ఈ తరానికి చెందిన పిల్లలకుఇ యువతులకు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి జీవన శైలిని తెలియచేయుటకు బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు.

అంతే కాక కొందరు ఈ సందర్భంగా పిల్లలకు ప్రవక్త గారి జీవన శైలి మొదలగు అంశాల పై రచనా పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యం ఏమనగా మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి పట్ల మనకు ఉన్న ప్రేమ భావాన్ని ప్రదర్శించడం తప్ప ఇంకే కారణ ఉంటుంది. కానీ ఇక్కడ ఒక ఆలోచించాల్సిన విషయం ఒకటి ఉంది.

ప్రేమాభీమానాలు వ్యక్త పరిచేందుకు కూడా మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు మనకు ఏదైనా పద్ధతి నేర్పించారా లేక ఎవరికి ఇష్టమొచ్చినట్టు వారు వ్యక్త పరుచుకోవచ్చా?

నా అభిప్రాయం ప్రకారం కొద్దో గొప్పో మంచి బుద్ధి కలవాడు మరియు ఇస్లాం యొక్క జ్ఞానం కలవాడు ఒక పద్ధతి ప్రకారం ప్రేమాభిమానాలను వ్యక్త పరచడానికి నియమ నిబంధనలను భోదించి ఉంటారని భావిస్తారు. మరియు ఎవరి ఇష్ట ప్రకారం

వారు స్వేచ్ఛగా జరుపుకోవడాన్ని వ్యతిరేకిస్తాడు. అంటే ఎలాగైతే అన్ని విషయాలలో మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఒక క్రమ పద్ధతిని పాటించాలని వివరించారో, అలాగే ఈ విషయంలో కూడా అల్లాహ్ మెచ్చిన ఒక క్రమమైన పద్ధతిని మనకు నేర్పించారు, ఏదైతే సహాబా రజియల్లాహు అన్‌హుమ్ మరియు ఔలియా రెహ్మతుల్లాహి అలైహిమ్ యొక్క జీవితాలలో వెదికి చూస్తే మనకు కనబడుతుందో.

అసలు పాటించవలసిన పద్ధతులు పైన పేర్కొన్న విధంగా ఉంటే, ప్రస్తుతం మన చుట్టూ జరుగుతున్న మీలాదున్ నబీ కార్యక్రమాలను ఇస్లాం యొక్క చూపుతో మరియు మన పెద్దల యొక్క సంస్కృతి అనే తక్కెడలో పెట్టి వాటికి అణుగుణంగా ఉన్నాయో లేదో చూద్దాం. వీటి నిర్వాహణ వల్ల లాభం చేకూరుతుందో లేదో ఒక సారి మనల్ని మనమే ప్రశ్నించుకుందాం.

ఒక చేదైన వాస్తవం ఏమిటంటే, ఒకటి అర సంధర్భాలు తప్ప ఆశించినంత లాభం చేకూరుటలేదు. ఫలితం ఎందుకు దక్కటం లేదు? మనలో మరియు మన జీవితాలలో మార్పు ఎందుకు కనుబడుటలేదు? ఈ ప్రశ్నలకు సమాధానమే 'ఇన్నమల్ అమాలు బినియ్యాత్'. మనలోని సంకల్పం మరియు మన వల్ల జరిగే తప్పులు మనకు ప్రతిఫలం అందకుండా చేస్తున్నాయి.

సాధారణంగా ఇటువంటి కార్యక్రమాలను క్రైస్తవులను అనుసరించో లేక ఇతర మతస్థులను చూసి మనము కూడా చేయాలని నిర్వహించడం జరుగుతోంది. ఎందుకంటే క్రైస్తవులు, హజ్రత్ ఈసా అలైహిస్సలామ్ గారి జన్మ దినాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గొప్పగా జరుపుతారు. అలా చేయడాన్ని మత ధర్మంగా మరియు ఈసా అలైహిస్సలామ్ గారి సాన్నిహిత్యం పొందేందుకు ఒక అవకాశంగా భావిస్తారు.

ఇలాగే భారతదేశంలోని ఇతర మతస్థులు మరియు వివిధ జాతులకు చెందిన వారు తమ తమ పెద్దల జన్మ దిన వేడుకులను ఉదా: శ్రీ రామ నవమి, గణేశ్ చతుర్థి మరియు వర్ధంతులను మరియు తద్దినాలను ఘనంగా జరుపుకుంటూ ఉంటారు. వారిని చూసి చూసి ఇస్లాంను పాటించేవారు కూడా 12 రబీయుల్ అవ్వల్ నాడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి పేరున వివిధ కార్యక్రమాలను జరుపుతూ ఉంటారు.

వ్యక్తిగత జీవితం ఎలా ఉన్నా, ఇంకా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి ఉపదేశాలకు అణుగుణంగా లేక పోయినా సరే, 12 రబియ్యుల్ అవ్వల్ నాడు బారా

ఫాత్ చేసి ఫాతిహా ఇస్తే మన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారికి దగ్గర అవుతామన్న అపోహతో చేస్తూ ఉంటారు. దీనికి అణుగుణంగానే సామాన్య ప్రజలు కూడా ఈ రోజును ఒక పండగ అని అనుకుని జరుపుకోవడం మొదలు పెట్టారు.

ఇక్కడితో ఆగక ఈ రోజుల్లో మన ప్రవక్త గారి పేరు మీద జరుగుతున్న సంబరాలు ఒక రాజకీయ సభగా మారిపోయింది. ఈ రోజుల్లో ప్రజలు తమ వైపు తిప్పుకోవడానికి ఈ ధార్మిక పద్ధతులను వాడుకుంటున్నారు. ఈ సభల్లో మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి పద్ధతుల గురించి చర్చించే కంటే తమ సొంత డబ్బా ఎక్కువ అయిపోయింది. అత్యంత దిగజారి పోయిన విషయము ఏమిటంటే, మొన్నటికి మొన్న ఒక ఆయన ప్రవక్త గారి లక్షణాలను ప్రస్తావిస్తూ తన శత్రువును మనఃస్ఫూర్తిగా తిట్టాడు. ఆలోచించాల్సిన విషయం ఏమిటంటే, మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి పవిత్ర జీవిత చరిత్రను ఒకరి పై మరొకరు కారాలు మిరియాలు విసురుకోవడానికి ఉపయోగిస్తున్నారు.

విడ్డూరమైన విషయం ఏమిటంటే మన ప్రవక్త గారి పేరు మీద జరుపుతున్న ఈ ఉత్సవాలు ఇరు వర్గాల మధ్య పోటిగా భావించి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఒక చోట ఒక వర్గం వారు తమ పెద్దలను పిలిచి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తే, అదే చోట అవతలి వర్గం వారు తమ పెద్దలను పిలిచి ఈ కార్యక్రమాన్ని ఇంకా పెద్దగా చేస్తున్నారు. కొంచెం ప్రశాంతంగా ఆలోచించి చూడండి! ఇటువంటి చేష్టల మూలంగా ఇస్లాం యొక్క నిర్వచనం ఇతరుల వద్దకు ఏవిధంగా చేరుతుందో! ఈ విధంగా పోటా పోటీగా చేసుకుంటూ పోతే బయట వారు వరకు ఎందుకు, మన ముస్లిముల మనసులలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి పై ప్రేమాభిమానాలు మరియు వారిని ఆచరించాలన్న కోరిక ఎలా పుడుతుంది? అసలు పుడుతుందా?

పైన చెప్పబడిన మూడు ఉదాహరణలు సంకల్ప లోపం వల్ల జరిగేవే. ఇంకా ఈ కార్యక్రమాలను ముందు పెట్టుకుని ఆలోచిస్తే ఇలాంటివి చాలా మన ముందుకు వస్తాయి. ఇంకా, నిర్వాహణలోనూ ఉన్న లోపాలను లెక్కపెట్టడం మొదలుపెడితే చాలా ఉంటాయి. అందులో లెక్కకు కొన్ని మీ ముందు ఉంచుతున్నాను.

దారికి అడ్డంగా స్టేజీలు కట్టడం: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు మనకు ఉపదేశించిన ప్రకారం ఈమాన్‌లో (విశ్వాసం) 70 కి పైగా శాఖలు ఉన్నాయి. వాటిలో ఒకటి ఎమనగా, దారి నుండి కష్టంకలిగించే వస్తువును తొలగించడం. పైన పేర్కొన్న దానిని బట్టి దారిలో కష్టం కలిగించే వస్తువులను తొలగించుటయే విశ్వాసమైతే, దారికి అడ్డంగా స్టేజీలను నిర్మచడం? ఆలోచించాల్సిన విషయం. అంతే కాక ముఖ్యంగా వివిధ ప్రాంతాలకు కూడలికి అడ్డంగా దేనినైనా నిర్మిస్తే, ఆ దారిని ఉపయోగించే వారికి ఎంతో కష్టం కలుగుతుంది. మత పరమైన ధార్మిక ఉపన్యాసాలు ఇచ్చేందుకు ఎవరికైనా మసీదు ఇష్టం లెకపోతే కనీసం ఒక పెద్ద గ్రౌండ్‌లోనైనా నిర్వహించుకోవాలి. ఈ విషయంలో మన వారు ఎంత మూర్ఖంగా ప్రవర్తిస్తారు అన్న దానికి ఒక ఉదహారణ ఏమిటంటే, గణేష్ ఉత్సవాలు ఇక్కడే జరిగాయి కనుక సీరతె నబీ ఉత్సవాలు కూడా ఇక్కడే జరగాలి అని ఒక చోట కొందరు కుర్రవాళ్ళు మొండికేసారు. అంటే విశ్వాసులు మరియు అవిశ్వాసుల స్వభావంలో ఎటువంటి తేడా లేదన్న మాట. సిగ్గుతో తలెత్తుకోలేని సంధర్భం.

లౌడ్ స్పీకర్‌ల వినియోగం: సాధారణంగా నివాస స్థలాల్లో ముస్లిమ్‌లతో పాటు ఇతర వర్గానికి చెందిన వారు కూడా ఉంటారు. అంతే కాక పిల్లలు, స్త్రీలు, వృద్ధులు కూడా ఉంటారు. వీరందరినీ దృష్టిలో పెట్టుకోకుండే గుండెలు అదిరేటట్లు లౌడ్ స్పీకర్‌లు ఉపయోగిస్తూ ఉంటారు. ఎవరి పేరు మీద ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామోవారి యొక్క సంస్కృతినే పక్కన పెడుతున్నాము.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు తన చుట్టు ప్రక్కల ఉండేవారిని ఎల్లప్పుడూ దృష్టిలో ఉంచుకుంటారు. రాత్రి ఇంటికి వస్తే సలామ్ చేసి వచ్చేవారు, అదీ ఎలాగంటే నిద్ర పోతున్నవారికి అసౌకర్యం కలిగేది కాదు మరియు మేలుకువగా ఉన్నవారికి వినపడేలా సలామ్ చేసే వారు.

స్టేజి లైటింగ్: ఈ రోజుల్లో లైటింగ్ కోసం చేస్తున్న ఖర్చును చూస్తే అమ్మో! అని అనిపిస్తుంది మరియు ఆ హంగామాని చూస్తే హిందువుల పెళ్ళిలాగానో లేకపోతే వారి పండుగ అయిన దీపావళిని గుర్తుకు తెస్తుంది. ఇస్లామీ పండితులు ఈ విధంగా ఖర్చు పెట్టడాన్ని ఖండించారు. ఈ కార్యక్రమం అందరూ పాల్గొనే కార్యక్రమం కనుక హిందువుల కార్యక్రమాన్ని పోలి ఉందని చెప్పలేక పోయినా అనవసరపు ఖర్చు అని చెప్పవచ్చు. ఇస్లాం మనకు సాదా సీదాగాజీవితం గడపాలని నేర్పిస్తుంది. అటువంటి మతానికి చెందిన ప్రవక్తను ఉద్దేశించి చేస్తున్న కార్యక్రమానికి ఈ హంగు ఆర్భాటం ఎంత వరకు అవసరం?

ఆహ్వానితులు: కొన్ని సార్లు రాజకీయ నాయకులను లేదా పలుకబడి ఉన్న వ్యక్తులను ఆహ్వానించడమే కాక వారికి ప్రసంగించే అవకాశం కూడా ఇవ్వబడుతుంది. వారికి మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి చరిత్ర తెలియపోవడం వల్ల ఏవోవో తప్పుడు తడకలు చెబుతారు. ఇస్లాంలో తప్పుడు తడకల విషయాలను అదీ ముఖ్యంగా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి పై చెప్పడాన్ని పెద్ద నేరంగా పరిగణించబడుతుంది. మరియు ఈ నేరానికి ప్రళయ దినాన అల్లాహ్‌కు సంఝాయిషీ ఇచ్చుకోవలసి వస్తుంది.

చందా: కొన్ని చోట్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చందా వసూలు చేస్తూ ఉంటారు. కొందరైతే డబ్బాలు చేతులో పట్టుకుని అందరి వద్ద అడుగుతూ ఇచ్చే ఉద్దేశ్యం లేకపోయినా బలవంతంగా ఇచ్చేలా చేస్తారు. ఇది ఎంత మాత్రమూ సరి కాదు. ఎవరి పేరు మీదైతే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారో అంటే ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు, 'ఒక ముస్లిమ్ అయిష్టంగా ఇచ్చిన సొమ్ము, ధర్మ సమ్మతమైనది కాదు' అని సెలవిచ్చారు.

నిర్వాహకుల ప్రార్థనలు: నిర్వాహకులలో ముఖ్యంగా కుర్రాళ్ళు సభ నిర్వాహణ పనులలో నిమగ్నమై సమాయానికి నమాజులు చదవరు. అతి ముఖ్య ప్రార్థన అయిన నమాజు కూడా చదవకుండా చేసిన ఏర్పాట్ల వల్ల ఏమి లాభం చేకూరుతుంది.

ఇంకా ఈ కార్యక్రమములో జనం వచ్చేవరకు ఖురాన్ చదివిస్తూ ఉంటారు. అంటే ఖుర్‌ఆన్‌ను టైమ్ పాస్ చేయడానికి ఉపయోగిస్తున్నారు. ఇది ఎంత మాత్రము సరికాదు.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి గురించి ప్రసంగాలు జరుగుతున్నప్పుడు కొంత మంది వినయంగా కూర్చుని వింటారు, మరికొందరు నుంచుని తమ తోటి వారితో మాట్లాడుకుంటూ ఉంటారు. మరి కొందరైతే మొటరు సైకిళ్ళ పై కూర్చుని పిచ్చా పాటి మాట్లాడుకుంటూ ఉంటారు. ఇది ఎంత అమార్యాదమైన చర్య.

ఆలోచించండి. ఒకప్పుడు మానవత్వపు విలువలు నేర్పి జీవితాలనే మార్చి వేసిన, ఎందరో అవిశ్వాసులకు విశ్వాసాన్ని ప్రసాదించిన ఈ సీరతె నబీ' ఈ రోజు ఒక ఫ్యాషన్‌గా తయారయ్యింది. ఒట్టి పండగ వాతావరణం కల్పిస్తున్నాయి గానీ ఎటువంటి లాభం లేకుండా నిస్సారవంతంగా తయారయ్యాయి. ఈ కార్యక్రమాలను మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు చెప్పిన రీతిగా మలచి దైవానుగ్రహం పొందేలా చేయమని అల్లాహ్‌ను ప్రార్థిస్తూ...(ఆమీన్)

వస్సలామ్

పైగామె హిదాయత్ వ్యవస్థాపకులు మరియు పర్యవేక్షకులు

ముహమ్మద్ అబ్దుల్ ఖవీ

నాజిమ్, ఇదారా అషఫుల్ ఉలూమ్ ట్రస్ట్, హైదరాబాదు

అల్లాహ్ యొక్క ప్రవచనాలు

ముఫ్తీ ముహమ్మద్ తకీ ఉస్మానీ సాహబ్

సూరతుల్ అత్తారిక్

ఈ సూరత్ మక్కీ అంటే మక్కాలో అవతరించింది.

ఈ సూరత్‌లో 17 ఆయత్‌లు మరియు ఒక రుకూ ఉన్నాయి.

బిస్ మిల్లాహిర్ రెహ్‌మాన్ నిర్రహీమ్

అల్లాహ్ పేరుతో మొదలు పెడుతున్నాను ఎవరైతే కరుణించేవాడో, అమితమైన కరుణా స్వభావం కలవాడో

1. వస్ సమాఇ వత్ తారిక్

ఆకాశం పై మరియు రాత్రి పూట వచ్చే వాటి పై ప్రమాణం, (1)

(1) మరియు తరువాతి రెండు ఆయత్‌లలో దీని అర్థం ఇలా చెప్పబడి ఉంది – దీని అర్థం తళుక్కుమని మెరిసే నక్షత్రాలు అని అర్థం. ఎందుకంటే అవి రాత్రి సమయంలోనే మనకు కనిపిస్తాయి. వాటిపై ప్రమాణం చేసి, 'మానవులందరూ పర్యవేక్షణలోనే ఉన్నారు. ఏ ఒక్కరూ దీనికి మినహాయింపు కాదు' అని చెప్పబడింది. నక్షత్రాల పై ప్రమాణం చేయడం వెనుక అసలు విషయం ఏమిటంటే ఎలాగైతే భూమి పై అన్ని చోట్ల నుండి నక్షత్రాలు కనబడుతాయో మరియు భూమి పై ఉన్న ప్రతీది నక్షత్రాల ముందు ఉంటాయో, అలాగే అల్లాహ్ తాలా మానవుల ప్రతీ కదలికను మరియు వారి ప్రతీ మాటను పర్యవేక్షిస్తుంటారు. మరియు అంతే కాక అల్లాహ్ యొక్క దైవ దూతలు కూడా ఈ విషయనికై నియమించబడ్డారు.

2. వమా అద్‌రాక మత్ తారిక్

మరియు నీకు ఏం తెలుసు, రాత్రి పూట వచ్చేవి ఏమిటని?

3. అన్ నజ్‌ముస్ సాకిబ్

(అవి) తళుక్కుమని మెరిసే నక్షత్రాలు!

4. ఇన్c కుల్లు నఫ్సిల్ లమ్మా అలైహా హాఫిజ్

ఇంకా, పర్యేవేక్షకుడు లేకుండా ఏ ఒక్క ప్రాణీ లేదు

5. ఫల్ యన్c జురిల్ ఇన్cసాను మిమ్మ ఖులిక్

ఇక ఇప్పుడు మానవులు ఆలోచించాల్సి ఉంది, తాము దేనితో సృష్టించబడ్డాము అని?

6. ఖులిక మిమ్మా ఇన్ దాఫిక్

వారు ఉరకలు వేస్తున్న నీటితో సృష్టించబడ్డారు

7. యఖ్తుజు మిమ్c బైనిస్సుల్బి వత్ తరాఇబ్

ఏదైతే వీపు(వెన్ను పూస) మరియు గుండెల యొక్క ఎముకల మధ్య నుండి ఉత్పత్తి అవుతుందో (2)

(2) దీని అర్థం ఆ వీర్య కణాలు, వేటి ద్వారా మనిషి యొక్క సృష్టి సాకారమవుతుందో. మరియు వెన్నుపూస మరియు గుండెల యముకుల మధ్య నుండి ఉత్పత్తి అవుతుంది అంటే, మనిషి యొక్క శరీరంలోని మధ్యలో ఉండే ఆ భాగమే ఈ కణాలకి కేంద్రము అన్న మాట.

8. ఇన్నహూ అలా రొజ్యిహీ లకాదిర్

కచ్చితంగా, వారు(అల్లాహ్), వారిని(మనుష్యులను) తిరిగి సృష్టించగల సామర్థ్యం కలిగి ఉన్నారు.

9. యౌమతుబ్లస్ సరాఇర్

ఏ రోజైతే దాగి ఉన్న వాటన్నిటి గురించి విచారించబడుతుందో

10. ఫమా లహూ మిన్c కువ్వతివ్c వలా నాసిర్

అప్పుడు మనిషి దగ్గర శక్తి ఉండదు మరియు రక్షించేవాడు కూడా ఉండడు

11. వస్ సమాఇ జాతిర్ రొజ్ఞ్

వర్షంతో నిండిఉన్న ఆకాశం పై ప్రమాణం,

12. వల్ అర్జి జాతిస్ సొదత్

మరియు చీలిపోయే భూమి పైనా (3)

(3) అంటే ఆ భూమి, ఏదైతే వర్షం పడగానే దాని లోపల ఉన్న గింజల నుండి మొలకెత్తే మొలకల్ని బయటకు తీయడానికి చీలుతుందో, ఆ భూమి సాక్షిగా అని చెప్పబడి ఉంది. ఇక్కడ 'వర్షం మరియు చీలిపోయే భూముల పైనే సాక్షి' అని ఎందుకు చెప్పబడిందంటే, వాన నీటి నుండి ఆ భూమే లాభపడుతుంది ఎందులోనైతే ఆ నీటిని ఉపయోగించుకునే సామర్థ్యం ఉన్నదో. ఇలాగే, వారే లాభపడతారు ఎవరి వద్దనైతే సామర్థ్యం ఉన్నదో, అని ఖుర్ఆన్‌లో చెప్పబడి ఉంది.

13. ఇన్నహూ ల కౌలుc ఫస్ల్

ఇంకా, ఇది(ఖుర్ఆన్) తీర్పు(అంతిమమైన తీర్పు) ఇచ్చే వాక్కు

14. వమాహువ బిల్ హజ్ల్

మరియు ఇది నవ్వుతాళి కాదు

15. ఇన్నహుమ్ యకీదూన కైదా

నిశ్చయంగా వీరు(అవిశ్వాసులు) వ్యూహరచనల్లో మునిగి తేలి ఉన్నారు.

16. వ అకీదు కైదా

మరియు నేను కూడా నా వ్యూహాన్ని రచిస్తున్నాను

17. ఫమహ్హిలిల్ కాఫిరీన అమ్ హిల్ హుమ్ రువైదా.

కనుక (ఓ ప్రవక్తా!), అవిశ్వాసులకు అలుసు ఇవ్వు, వారిని కొన్ని రోజుల వరకు వారి మానన వారిని వదిలి వేయి, (4)

(4) అంటే అవిశ్వాసులను శిక్షించే సమయం ఇంకా రాలేదు. అందుకే ఇప్పటికి వారిని వారి వారి మానన వదిలి వేయి. సమయం వచ్చినప్పుడు, అల్లాహ్ వారిని శిక్షిస్తారు.

ప్రియమైన పాఠకులారా, సంవత్సరపు చందా పూర్తయినవారు, దయ చేసి తమ చందాను మనీ ఆర్డర్ ద్వారా కానీ, లేక క్రింద ఇవ్వబడిన మా యొక్క బాంకు ఎకౌంట్‌లో జమచేయగలరు.

ఎకౌంటే పేరు: Mohd Abdul Qavi

ఎకౌంట్ నెంబరు మరియు బ్రాంచి: 035210011034204,

Andhra Bank, Malakpet Branch

హదీసు పరిమళం

నామస్మరణం (జిక్ర్)

మౌలానా ముహమ్మద్ మంజూర్ నోమానీ (రహ్)

హదీసు 1: హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) గారి నివేదిక ప్రకారం దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లఎయి గారు, 'ప్రతీ వస్తువును శుభ్రం చేయడానికి ఒక సాధనం ఉంటుంది. అలాగే, మానవుని హృదయాన్ని శుభ్రం చేసే సాధనమే జిక్ర్ (అల్లాహ్ యొక్క నామస్మరణం). అల్లాహ్ యొక్క శిక్ష నుండి తప్పించడంలో మరియు మోక్షసాధనలో అల్లాహ్ యొక్క జిక్ర్‌ను మించిన సాధనం మరొకటి లేదు' అని ఉపదేశించారు.

అప్పుడు ప్రజలు ఇలా అడిగారు, 'ఓ దైవ ప్రవక్తా! దైవ మార్గంలో జిహాద్ చేయడం కంటే కూడానా?' (అంటే జిహాద్ కంటే మించిన సాధనమా?) అని అడిగారు.

దానికి, 'అవును. (చేతిలో ఉన్న) కత్తి ముక్కలు అయ్యే దాకా మరియు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దైవ మార్గంలో పోరాడినా – అటువంటి జిహాద్ కూడా – మోక్షమార్గం పొందుటలో జిక్ర్‌కు సమానం అవ్వదు' అని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు పైన అడిగిన ప్రశ్నకు సమాధానంగా విన్నవించారు.

<u>వివరణ:</u> వాస్తవంగా ఇస్లాం మనకు నేర్పిన కార్యాలన్నిటిలోకి ఉత్తమమైన మరియు అల్లాహ్‌కు ప్రీతి పాత్రమైన ఆరాధన జిక్ర్. అల్లాహ్ యొక్క దాసునకు జిక్ర్ చేసే సమయంలో కలిగే అనుభూతి మరియు అల్లాహ్ యొక్క సాన్నిహిత్యము మరే ఇతర ఆరాధనా సమయంలో అంతలా కలుగదు. ఇక్కడ మాత్రం ఒక విషయం గుర్తుంచుకోవాలి. జిక్ర్ చేసే సమయంలో మన మనస్సులను అల్లాహ్ వైపే ఉంచాలి. అనంత లోకాల సృష్టి కర్త మరియు మనందరి ప్రభువైన అల్లాహ్ తప్ప ఇతర విషయాలన్నిటినీ పక్కన పెట్టి వారి పైనే ధ్యాస కలిగి ఉండాలి. వారి యొక్క ప్రేమామృతంలో తడిసి ముద్దవుతూ, వారి నామమును జపించాలి. అప్పుడే వారి యొక్క సన్నిధానమునకు దగ్గర అవుతాము.

అల్లాహ్, తన గ్రంధమైన ఖుర్‌ఆన్‌లో, ఇలా సెలవిచ్చారు: **'ఫజ్ కురూనీ అజ్‌కుర్‌కుమ్...'** అంటే 'మీరు నన్ను స్మరించండి, నేను కూడా మిమ్ములను స్మరిస్తాను (అంటే నేను కూడా మిమ్మల్ని ఎంతో గొప్ప సమూహమైన దైవ దూతల సమక్షంలో గుర్తుచేసుకుంటాను).

ఒక్క విషయం తెలుసుకోవలిసినది ఏమిటంటే, జికిర్ అంటే దైవ నామస్మరణమే కాక దివ్య ఖుర్‌ఆన్ యొక్క పఠనము, నమాజు చదవడం కూడా అని తెలుసుకోవాలి.

హదీసు 2: హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ బుసర్ రజియల్లాహు అన్హు గారి నివేదిక ప్రకారం, ఒక వ్యక్తి దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి సన్నిధికి వచ్చి, 'ఓ దైవ ప్రవక్తా! మనుషుల్లో కల్లా ఎవరు ఉత్తములు?' అని అడిగాడు.

దానికి, 'దీర్ఘాయుష్షు కలిగి మంచి పనులు చేసేవారు' అని సెలవిచ్చారు.

ఆ వ్యక్తి, 'ఓ దైవ ప్రవక్తా! ఆచరణలలో కెల్లా ఉత్తమమైన ఆచరణ ఏది?' అని మళ్ళీ అడిగాడు.

'మీరు ప్రపంచానికి వీడ్కోలు పలుకుతున్నపుడు మీ నాలుక అల్లాహ్ యొక్క నామస్మరణతో నాని ఉండటం' అని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు సెలవిచ్చారు.

(ముస్నదె అహ్మద్, తిర్మిజీ)

వివరణ: ఆ అరేబియా పల్లెవాసి అడిగిన మొదటి ప్రశ్నకు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఇచ్చిన సమాధానం మనకు సులభంగానే అర్థమవుతుంది. అంటే, ఒకరికి మంచి పనులు చేసే అదృష్టం కలగడమే చెప్పుకోదగ్గ విషయం. దానితో పాటుగా వారికి ఆ మంచి పనులు చేయడంతో పాటుగా వాటిని చేయడానికి దీర్ఘాయుష్షు కలిగితే ఇంక చెప్పనవసరం లేదు. కచ్చితంగా అతడు అందరికంటే ఉత్తముడనే చెప్పుకోవాలి. మరొక మాటలో చెప్పాలంటే అల్లాహ్ యొక్క ప్రసన్నత మరియు కరుణా కటాక్షాలకు అంతే ప్రాప్తుడవుతాడని చెప్పుకోవచ్చు.

ఇక రెండో జవాబుకు వస్తే, మనలో ప్రాణమున్నంత వరకూ మరియు ముఖ్యంగా ఆఖరి సమయంలో అల్లాహ్ యొక్క ధ్యాస కలిగి వారి యొక్క నామస్మరణతో తపించిపోవడం అన్నది ఉత్తమమైన ఆచరణ అని సెలవిచ్చారు. వాస్తవంగా, అల్లాహ్ పై ప్రేమతో మరియు వారి యొక్క నామస్మరణంతో జీవితం గడపడం అన్నది ఒక గొప్ప వరం. ఎవరైతే దీని విలువను గుర్తించారో వారు తమ వద్ద ఉన్న సమస్తాన్ని సైతం త్యజించి ఈ యొక్క వరాన్ని పొందడానికి ప్రయత్నిస్తారు. ఇక్కడ ఇంకో ముఖ్యమైన విషయం తెలుసుకోవలసి ఉంది. అది ఏమిటంటే, ఎవరైతే తమ తమ జీవితంలోని ప్రతీ నిమిషము అల్లాహ్‌ను స్మరించుకుంటూ గడిపారో, అటువంటి వారికే చివరి నిమిషంలో అంటే చావుకు ముందు అల్లాహ్ యొక్క నామాన్ని జపించే అదృష్టం కలుగుతుంది.

హదీసు 3: హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ రజియల్లాహు అన్హు గారి ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఇలా ఉపదేశించారు, 'అల్లాహ్ యొక్క నామస్మరణ లేకుండా ఎక్కువ మాట్లాడకండి. దీని వల్ల హృదయం బండ బారి పోతుంది. హృదయంలో కఠినత్వం ఉన్నవాడు అల్లాహ్‌కు అందిరికంటే దూరంగా ఉంటాడు. (జామ-ఎ-తిర్మిజీ)

<u>వివరణ:</u> ఎవరైతే అల్లాహ్ యొక్క నామస్మరణం లేకుండా మరియు పనికిరాని విషయాలు మాట్లాడుతూ ఉంటారో, వారి మనస్సులు చాలా కఠినంగా తయారు అవుతాయి. వారి హృదయాలు చాలా కఠినంగా తయారు అవుతాయి. ఆ హృదయాలలో అల్లాహ్ యొక్క నూర్ (వైలుగు) ఉండదు. చీకటిగా తయారు అవుతాయి. అటువంటి వారు అల్లాహ్ యొక్క ప్రసన్నతకు మరియు సన్నిధికి దూరంగా ఉంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే, వారిలో మంచి అనేదే ఉండదు.

లంచం

మౌలానా ముహమ్మద్ అబ్దుల్ ఖవీ

బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీమ్–నహ్మదుహూ వనుసొల్లిఅలా రసూలిహిల్ కరీమ్

"లంచం" యొక్కనిర్వచనం:

"అర్ రిష్వహ్" అనే అరబీ పదాన్ని 'రా' పై జబర్, జేర్, పేష్ మూడు విధాలుగా చదవచ్చు. (రవ్వహ్, రివ్వహ్, రుష్వహ్ మూడు విధాలుగా చదవచ్చు. మూడిటి అర్థం ఒక్కటే. కాని ఎక్కువగా రిష్వహ్ అనే వాడుతారు). దీని బహువచనం 'రుషా' వస్తుంది. "తీర్పు తనకు అనుకూలంగా రావాలని లేదా తను అనుకున్న పని జరగాలని హాకిమ్ (పరిపాలకుడు) లేదా ఎవరైనా అధికారికి ఇచ్చే డబ్బు లేదా ఇతర వస్తువులను లంచం అంటారు" (రద్దుల్ ముహ్తార్ 8/34)

ఇంకా క్లుప్తంగా చెప్పాలంటే "ఒకరి నుండి తనకు రావలసిన హక్కును వసూలు చేసుకునేందుకు అతని పై ఖర్చు పెట్టే దాన్ని లంచం అంటారు." ఎందుకంటే ఎవరి హక్కు వారికి అందించడం ప్రజా ప్రతినిధి యొక్క చట్టపర మరియు ధార్మిక కర్తవ్యం. ఆ కర్తవ్యాన్ని నెరవేర్చేందుకు వేతనం తీసుకోవడం అధర్మం. కాబట్టి ప్రజా ప్రతినిధులు ఒకరి దౌర్జన్యం నుంచి మరొకరిని రక్షించేందుకు లేదా ఎవరి హక్కు వారికి ఇప్పించేందుకు తీసుకునే గిఫ్టులు అన్నీ కూడా లంచమే.

లంచం మరియు గిఫ్ట్ లో తేడా

అల్లామా ఇబ్నె నుజైమ్ రహ్మతుల్లాహి అలైహ్ అల్ బహరుర్రాయిక్ 6/262 లో ఇలా అన్నారు: గిఫ్ట్ మరియు లంచం మధ్య తేడా ఎమిటంటే గిఫ్ట్ ఎటువంటి షరత్తు లేకుండా ఎదుటి వారి పట్ల తమ అభిమానాన్ని చాటాలని, ఇరువురి మధ్య ప్రేమాభిమానాలు పెరగాలని ఇవ్వబడుతుంది.

దీనికి వ్యతిరేకంగా లంచం తనకు తిరిగి సాయం చేయాలనే షరత్తుతో కూడి వుంటుంది. దీని వెనుక ఏదో ఒక ఉద్దేశం మరియు లక్ష్యం తప్పకుండా ముడిపడి వుంటుంది.

దివ్య ఖురాన్‌లో అల్లాహ్ తఆలా ఇలా ఆదేశిస్తున్నారు: మీరు ఒకరి సొమ్మును మరొకరు అన్యాయంగా కబళించకండి (తినకండి) మరియు బుద్ధిపూర్వకంగా, అక్రమమైన రీతిలో, ఇతరుల ఆస్తిలో కొంతభాగం తినే దురుద్దేశంతో న్యాయాధికారులకు లంచాలు ఇవ్వకండి.

అంటే మీకు ధర్మ–అధర్మాలు తెలుసు, అయినప్పటికీ అధికారులు ఇతరుల హక్కు మీకు ఇవ్వాలని వారికి రకరకాల పేర్లు పెట్టి, ఏదో ఒక రకంగా లంచాన్ని సమర్పిస్తున్నారు. నిస్సందేహంగా ఇది దౌర్జన్యం, ధర్మవిధికి వ్యతిరేకమైన కార్యం. ఇక తన హక్కు తాను పొందేందుకు లేదా

ఇతరుల దౌర్జన్యం నంచి బయటపడేందుకు డబ్బులు సమర్పించుకోవడం కూడా లంచమే కాని అందులో కొంత వివరణ వుంది, దాని గురించి తరువాత చర్చించడం జరుగుతుంది (ఇన్షా అల్లాహ్).

డబ్బు సంపాదించేందుకు అవలంభించే ప్రతీ అధర్మ విధానం ఇస్లాంలో నిషేదించబడినది. మరియు ఇస్లాం దృష్టిలో నీచమైన కార్యం అని పై ఆయత్తు (దివ్య ఖురాన్ ప్రవచనం) ద్వారా మనకు అర్థమైంది. (ఆయత్‌లో ఫలానా ఫలానా అధర్మ విధానాలే నిషేధం అని అనలేదు, డబ్బు సంపాదించే అధర్మ విధానం ఏదైనా సరే అది నిషేధితం అని స్పష్టంగా ఎటువంటి మినహాయింపు లేకుండా చెప్పబడింది) మరి లంచం కూడా డబ్బు సంపాదించేందుకు అధర్మ మార్గమే కాబట్టి అది కూడా అయత్తులోని స్పష్టమైన ప్రకటన ద్వారా హరామ్ అని, శాస్త్రసమ్మతము కానిదని నిర్ధారించబడింది. ప్రముఖ ముహద్దిస్ హాఫిజ్ షంషుద్దీన్ జహబీ రెహ్మతుల్లాహి అలైహి గారు లంచగొండితనానికి సంబంధించిన హదీసుల అధ్యాయంలో మొట్ట మొదట ఈ ఆయత్తునే ఉటంకిస్తూ వ్రాసి లంచం ఇస్లాంలో నిషిద్ధమని దీని ద్వారా రుజువు చేసారు.

హజ్రత్ అబు హురైరా రజియల్లాహు అన్హు గారి కథనం ప్రకారం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఇలా అన్నారు: అల్లాహ్ తఆలా "రాషీ" మరియు "మురత్షీ" ఇద్దరిపై లానత్ చేసారు. ఈ హదీసును ఇమామ్ తిర్మిజీ రెహ్మతుల్లాహి అలైహి గారు 'హసన్' సనదుతో ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ తన 'సహీ' లో, హాకిమ్ తన 'ముస్తద్రక్' లో వీరిద్దరితోపాటు "రాయిష్" ను కూడా పేర్కొన్నారు.

"రాషి" అంటే లంచం ఇచ్చేవాడు, "మురత్షీ" అంటే లంచం తీసుకునే వాడు, 'రాయిష్' అంటే మధ్యవర్తి అని ఉలమా అన్నారు.

ఈ హదీసులో ఎంతటి భయంకరమైన జడిపింపు వుంది! ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి నోట ఇటువంటి వ్యక్తి పై లానత్ చేయబడింది. లానత్ నిర్వచనం తెలుపుతూ ఉలమా ఇలా అన్నారు: "లానత్ అంటే అల్లాహ్ యొక్క దయా–కరుణల నుండి బహిష్కరింపు." లంచం మామూలు పాపము కాదు. ఎందుకంటే "ఏ పాప కార్యాములపై దివ్య ఖురాన్ మరియు హదీసు లో లానత్, దైవాగ్రహం చూపబడిందో అవి పాపాలలోకల్ల అతి పెద్ద పాపాలు" అని ఘోర పాపాల నిర్వచనంలో ధార్మిక పండితులు పేర్కొన్నారు. మరి లంచం ఇచ్చేవారి పై, తీసుకునే వారి పై లానత్ (అల్లాహ్ దయా–కరుణలనుంచి బహిష్కరించబడాలని శపించడం) జరిగిందంటే అది కూడా పెద్ద అపరాధమేనని స్పష్టమౌతుంది. అంతే కాదు ప్రవక్త సల్లల్లాహు ఆలైహి వసల్లమ్ గారు ఏ వడ్డీనైతే తమ సొంత తల్లితో వ్యభిచారం చేసినంత పెద్ద పాపమని అన్నారో దానికి లంచం పెద్ద ద్వారము అని అన్నారు. అబూ దావూద్ లో హజ్రత్ అబూ ఉమామా బాహిలీ రజియల్లాహు అన్హు గారి ఉల్లేఖనం ఈ విధంగా వుంది : "ఒక వ్యక్తి వేరొకరి గురించి ఓ చోట సిఫార్సు చేసాడు. (దాని మూలంగా అతని అవసరం తీరింది) ఆ రెండవ వ్యక్తి

సంతోషించి ఒక బహుమానాన్ని ఇచ్చాడు. (దాన్ని స్వీకరించిన) ఆ మొదటి వ్యక్తి వడ్డీ యొక్క పెద్ద ద్వారానికి చేరుకున్నాడు" అని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ అన్నారు. అల్లాహ్ మనందరినీ దీని నుంచి కాపాడు గాక! ఆమీన్...

హజ్రత్ అబ్దుల్లా ఇబ్నె మసూద్ రజియల్లాహు అన్హు గారు ఇలా ఉపదేశించారు: ఓ ముస్లిం సోదరుడి హక్కు అతడికి ఇప్పించమని నిన్ను కోరితే నువ్వు అతడి హక్కు అతడికి అందేలా చేసావు. ఆ తరువాత అతడు ఒక బహుమానాన్ని సమర్పించుకున్నాడు. నువ్వ గనక దాన్ని స్వీకరిస్తే అది "సుహ్త" (అంటే హరామ్ మరియు అపవిత్రమైనది) అవుతుంది. అదే విధంగా ఎవరైతే ఒ ముస్లిం సోదరునిపై జరుగుతున్న దౌర్జన్యాన్ని అరికట్టి, దానికి బదులుగా అతడి నుండి ఏదైనా బదులు స్వీకరిస్తే అది కూడా "సుహ్త" (అంటే హరామ్ మరియు అపవిత్రమైనది) అవుతుంది. ఇది విన్న ఒక వ్యక్తి, 'ఓ అబూ అబ్దుర్రహ్మాన్! మేము చట్ట తీర్పుల వ్యవహారాలలోనే లంచం ఇవ్వడం హరామ్ అని భావించేవాళ్ళం' అని అన్నాడు. దానికి ఇబ్నె మసూద్ రజియల్లాహు అన్హు గారు, 'తీర్పుల వ్యవహారంలో లంచం ఇవ్వడం కుఫ్ర్ (అంటే అది అవిశ్వాసులు చేసే పని, ఒక విశ్వాసి అలా ఎన్నడు చేయడు, ఎందుకంటే ఇక్కడ తప్పించుకున్నా పరలోకములో శిక్ష అనుభవించాల్సి వస్తుంది అని అతడు విశ్వసిస్తాడు కాబట్టి)' అని అన్నారు. (తబ్రానీ)

అల్లాహు అక్బర్! ఇస్లాంలో లంచ గొండితనం ఎంత నీచమైందో అర్థమైంది.

గుణపాఠం నేర్పే కొన్నిసంఘటనలు

లంచగొండితనం ఇంత నీచమైంది కాబట్టే సహాబా రజియల్లాహు అన్హుమరియు మన అస్లాఫ్ (పూర్వికులు) దీనికి చాలా దూరంగా వుండేవారు. లంచం కాదు కదా తమకు ఇస్తుంది లంచమేమో అన్న సందేహం కలిగినా దానికి కూడా దూరంగా వుండే వారు. చారిత్రిక పుస్తకాల్లో హజ్రత్ ఇబ్నె మసూద్ రజియల్లాహు అన్హు గారి గురించి ఇలా వ్రాయబడి వుంది.

'ఒక సారి వారు ఇబ్నె జియాద్ వద్ద ఒక బాధితుడి గురించి సిఫార్సు చేసి అతడికి సమస్య నుండి విముక్తి కలిగించారు. ఆ ఆనందములో అతడు వారి వద్దకు ఒక వస్తువు పంపించాడు. హజ్రత్ ఇబ్నె మసూద్ రజియల్లాహు అన్హు గారు (అందులో లంచపు ఛాయలు కనిపిస్తున్నాయి అని అనిపించి) దానిని వెనక్కి పంపించేసారు.

లంచాన్ని పసికట్టేందుకు ఫుకహా ఒక గుర్తును మనకు తెలియజేసారు. "ఇదివరకు ఎవరి తరుపు నుంచైతే కానుకలు వచ్చేవికావో అటువంటి వ్యక్తి మనతో పని పడగానే కానుక పేరుతో ఏదైనా పంపితే అది లంచమని గ్రహించాలి. (అల్ బహ్రుర్రాయిక్ : కితాబు అదబిల్ కాజీ)

ఒక సారి హజ్రత్ ఔజాయి రెహ్మతుల్లాహి అలైహి గారికి 'బాలబక్' ప్రాంతపు గవర్నర్ వద్ద తన కొరకు సిఫార్సు చేయమని ఒక వ్యక్తి కోరుతూ తేనెతో నిండిన కుండను వారికి కానుకగా ఇచ్చాడు. దానికి వారు ఇలా అన్నారు "నీకు రెండు విషయాల్లో నుంచి ఒకదాన్ని ఎంచుకునే అవకాశం ఇస్తాను. నీకు ఇష్టమొచ్చింది ఎంచుకో 1.నేను తేనె స్వీకరిస్తే సిఫార్సు

చేయను, 2. సిఫార్సు చేస్తే తేనె స్వీకరించను. అప్పుడతడు తేనె వెనక్కి తీసుకోగా అతడికి సిఫార్సు లేఖ ప్రాసిచ్చారు.

లంచం తీసుకోవడం కాదు కదా లంచం ఇస్తున్నాడు అని సంకోచం కలిగినా కానుకలను తిరస్కరించినటువంటి మన పూర్వీకుల వృత్తాంతాలు ఎన్నో ఉన్నాయి.

అంత దూరం ఎందుకు నేటి మన మత పెద్దల జీవితాల్లో సంభవించిన సంఘటనలు కూడా మనకు గుణపాఠం నేర్పుతాయి. హకీముల్ ఉమ్మత్ హజ్రత్ థానవీ రెహ్మతుల్లాహి అలైహి గారికి ఎవరైనా కానుకనిచ్చి దుఆ చేయమని కోరితే అది ఎంత ఖరీదుదైనా సరే దాన్ని తిరస్కరించే వారు. ఎందుకంటే దుఆ ముస్లిం యొక్క హక్కు, మరి తన హక్కు తాను పొందడానికి కానుక సమర్పిస్తున్నాడంటే దాని అర్థం ఏమిటి? అదే విధంగా మా గురువు గారైన హజరత్ మౌలానా షాహ్ అబ్రారుల్ హక్ రెహ్మతుల్లాహి అలైహి గారి మదరసాలో ఒక నోటీసు వ్రాసి వేళాడదీశారు "ఇక్కడ చదివే పిల్లల తల్లిదండ్రుల నుంచి ఎటువంటి గిఫ్ట్‌లు నేను సీకరించలేను, మీరు చేసే దుఆలు చాలు". ఎందుకంటే ఇంతకు ముందు వీరి మధ్య ఎటువంటి సంబంధాలు లేవు, సాధారణంగా పిల్లల చదువయ్యాక వారు ఎటువంటి సంబంధాలు కొనసాగించరు. కేవలం పిల్లలు చదివేంత వరకు ప్రింసిపల్ మరియు వారి కుటుంబ సభ్యులతో సంబంధాలు ఏర్పర్చుకుంటారు. వారికి కానుకలు, బహుమానాలు పంపుతారు. దీనికి కారణం వారి పిల్లల పట్ల శ్రద్ధ మరింత పెరగాలనో లేదా వారి పిల్లల పొరపాటులను సహించుకుంటూ పోవాలనో తప్ప ఇంకేముంటుంది. మరి ఇది లంచం కాకపోతే ఇంకేమిటి? కాని బాధాకరమైన విషయమేమిటంటే ధర్మ బోధనకు నిలయమైన మదరసాలలోనూ నేడు ఈ అధర్మ కార్యం సాధారణమైపోయింది. కనీసం దాని వైపుకు ధ్యాస కూడా మరలదు. (ఫ ఇలల్లాహిల్ ముష్తకా)

లంచం తో చేసిన పుణ్యకార్యాలు

ఎవరైనా లంచం తీసుకొని దానితో మంచి పనులు చేస్తే అవి అల్లాహ్ దగ్గర అంగీకరించబడవు. ఉదాహరణకి ఎవరైనా ఆ డబ్బుతో మసీదు లేదా మదరసా కట్టిస్తే, లేదా పేదలకు దానం చేస్తే, హజ్ యాత్రకు వెళితే, కుర్బానీ ఇస్తే లేదా ఇంకేమైనా పుణ్యకార్యాలు చేస్తే అవి అల్లాహ్ దగ్గర ఎన్నటికీ స్వీకరించబడవు. లంచం తీసుకొని దానితో పుణ్యకార్యాలు చేయడం అనేది చెత్తా చెదారాన్ని ఏరుకొచ్చి ఒక మహారాజుకో లెదా ఎవరైనా మహనీయుడికో ఇవ్వడ్డం లాంటింది. ఇది ఎలాగైతే అసభ్యకరంగా, నేరంగా భావిస్తారో ఇది అంతకన్నా పెద్ద నేరం. అందుకే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా అన్నారు: "అధర్మ సంపాదన తో చేసిన దాన ధర్మాలు స్వీకరించబడవు." ఇక ఎవరైనా వెర్రివాడు ఇటువంటి డబ్బుతో దానధర్మాలు చేసి పుణ్యాన్ని ఆశిస్తే అది ఇంకా పెద్ద నేరం అవుతుంది. మౌలానా యూసుఫ్ లుధ్యాన్వీ రెహ్మతుల్లాహి అలైహ్ కొంత మంది మతపెద్దల ప్రవచనాన్ని "ఆప్కే మసాయిల్ ఔర్ ఉన్ కా హల్ 6/177 "

లో వ్రాసారు "అధర్మ సంపాదనను పుణ్యాన్ని ఆశిస్తూ దానం చేస్తే (అతడు) విశ్వాసం నుండి విహీనపఱచబడతాడు. (అలాహ్ మనందరినీ రక్షించుగాక)

అదేవిధంగా ఎవరైనా ఆ డబ్బుతో కానుక ఇస్తే అది స్వీకరించడం జాయజ్ (చట్ట సమ్మతము) కాదు. కొన్ని కారణాల వల్ల దాన్ని స్వీకరించడమే సబబు అని అనుకుంటే దాన్ని తీసుకొని పేదలకు ఇచ్చేయాలి. అదే విధంగా వడ్డీ లేదా ఇంకేమైనా ఇతర చట్ట సమ్మతము కాని వ్యాపారం చేసే కంపెనీలు క్యాలెండర్, డైరీ మొదలగు కానుకలు ఇస్తే వాటిని స్వీకరించడం సరి కాదు.

కానుక పేరుతో లంచం

నేడు ఎక్కడ చూసినా లంచం సర్వసాధారణమైపోయింది. అధర్మపరులు, ధర్మనిష్ఠత లేని వారు నిర్భయంగా, బిడియపడకుండా లంచం తీసుకొని ఎంతో హాయిగా ఆస్వాదిస్తున్నారు. ఇక ధర్మపరులు అనబడేవారు కొంచం అటూ-ఇటూ చేసి లంచం తీసుకుంటున్నారు.

ఇచ్చేవాళ్ళు కూడా తమ స్వార్థం కోసం, తమ అవసరాలు తీర్చుకోవడం కోసం లంచానికి వివిధ రకాల పేర్లు పెట్టుకున్నారు. గుర్తుంచుకోండి! పేరు ఎంత ఆకర్షణీయంగా వున్నా హరామ్ హరామ్ గానే వుంటుంది. విషానికి చెక్కెర అని పేరు పెట్టినంత మాత్రానా అది చెక్కెర అవ్వదు(అలానే లంచం కూడా). కాని ఇలా పేర్లు మార్చి లంచం ఇచ్చిపుచ్చుకోవడంలో అపరాధం ఇంకా ఉగ్రరూపం దాల్చుతుంది. ఎందుకంటే ఇదోరకంగా ధర్మవిధులతో చెలగాటం మరియు అల్లాహ్ తఆలాను వంచించే ప్రయత్నం. ఇది ప్రళయదినపు సంకేతాలలో ఒకటి. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఇలా అన్నారు: "ప్రళయదినానికి ముందు 'షరాబ్' (మత్తుపానియాలు) ను షర్బత్ అని లంచానికి కానుక అని పేర్లు పెట్టి తమ కోసం హలాల్ (శాస్త్ర సమ్మతమైనవిగా) చేసుకునేందుకు ప్రయత్నిస్తారు" (అయాజమ్ బిల్లాహ్)

అదే విధంగా హజ్రత్ ఇమామ్ బుఖారీ రెహ్మతుల్లాహి అలైహి గారు ఇలా ఉల్లేఖిస్తున్నారు "ఓ సారి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు 'బనీ-అజ్ద్' కు చెందిన ఓ వ్యక్తిని జకాతు వసూలు చేసే అధికారిగా నియమించి (జకాత్ వసూలు చేసేందుకు) రవానా చేశారు. వారు తిరిగొచ్చాక వసూలు చేసిన డబ్బు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారికి ఇచ్చి ఇందులో నుంచి ఇంత భాగం మీది ఇంత నాది (నాకు కానుకగా వచ్చింది) అని అన్నారు. దానికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఇలా అన్నారు: " (నువ్వు) మీ తల్లిదండ్రుల ఇంట్లో కూర్చోని చూడు నీకు కానుకలు ఎవరు ఇస్తారో? (అధికారిగా నియమింపబడక ముందు రాని కానుకలు ఇపుడు వస్తున్నాయి అంటే వారు నీ నుండి ఏదో ఆశించి ఇస్తున్నారు) దీన్నిబట్టి అర్థమైంది ఏమిటంటే అధికారులకు ఇచ్చే కానుకలు వాస్తవంగా కానుకలు కావు, అవి లంచాలు.

హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ రెహ్మతుల్లాహి అలైహి గారు ఇలా అనేవారు

"కానుకలంటే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి కాలంలో ఒకరికొకరు ఇచ్చుకున్నవి, ఇవాళ కానుకలు ఎక్కడివి? అంతా లంచాలే. నిస్వార్థంగా ఇచ్చే కానుకలు ఈ రోజు లేవు. ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ రెహ్మతుల్లాహి అలైహి గారు మొదటి శతాబ్దపు పరిస్థితుల గురించి ఇలా అంటున్నారంటే మరి నేటి పరిస్థితుల గురించి ఇంకేమనాలి?

హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు గారు ఓ సారి హజ్రత్ అబూ హురైరా రజియల్లాహు అన్హు గారిని జకాత్ వసూలు చేసేందుకు పంపించారు. వారు (తిరిగొచ్చాక) కొన్ని వస్తువులు చూపించి ఇవి నాకు కానుకగా వచ్చాయి అని అన్నారు. హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు గారు కోపగించుకొని ఇలా అన్నారు " ఓ అల్లాహ్ యొక్క విరోధి! నువ్వు నీ ఇంట్లో వుండి చూడు, ఎవరు నీకు కానుకలు తెచ్చిస్తాడో... " అ తరువాత వారి నుంచి ఆ సొమ్ము తీసుకొని 'బైతుల్ మాల్' (ప్రజా ధనం) లో జమచేశారు.

ఈ వృత్తాంతాలన్నీ " అధికారులకు వచ్చే గిఫ్ట్లు సాధారణంగా గిఫ్ట్ల రూపంలో లంచాలే" అని తెలుపుతున్నాయి. పై వివరణ ద్వారా అధికారులు తమ డ్యూటీ సక్రమంగా నిర్వర్తించినందుకు దానికి సంబంధించిన వారి నుంచి వసూలు చేసే కానుకలు, బహుమానాలు అన్నీ లంచం క్రిందకు వస్తాయని, అది హరామ్ అని మనకు తెలిసింది. 'అధికారులు' అంటే అందులో జడ్జీలు, కలక్టర్లు, ఆఫీసర్లు, ప్రభుత్వ అధికారులు వారు ఏ శాఖకు చెందినవారైనా సరే అందరూ వస్తారు(అధికారులు అంటే పరిపాలకులు మాత్రమే అని భావించరాదు). అధర్మ సంపాదన తిన్న వారికి లభించే ప్రతిఫలం ఏమిటో ముస్లింలందరికీ తెలుసు. దివ్య ఖురాన్ మరియు హదీసులలో అధర్మ రీతిలో సంపాదించడం, అలాగే ఆ డబ్బును ఉపయోగించడం పై ఎటువంటి ఘోర జడిపింపులు వున్నాయో మరియు చివరికి వారి పుణ్యకార్యాలు, దుఆలు సైతం అంగీకరించబడవు, తిరస్కరింపబడతాయని హెచ్చరించబడింది. ఒక హదీసులో ఇలా వుంది "ప్రళయదినం నాడు వారి పుణ్యకార్యాలు తహామా(ఒక కొండ) సిఖరమంత పెద్దవిగా వున్నా అవి దుమ్ము ధూళిలా ఎందుకు పనికిరానివిగా మార్చివేయబడతాయి. చివరికి వారిని నరకం లోకి పడేయటం జరుగుతుంది." కాబట్టి ప్రతి చిన్న పనీ లంచం ఇచ్చి చేయించుకోవడమే తమ హాబీగా భావించే వారు, దీని గురించి గొప్పగా చెప్పుకుంటూ తిరిగే వారు, ఈ అలవాటు మానుకునే అవసరం ఎంతైనా వుంది. తప్పనిసరి పరిస్థితులు ఎదురైతే, మరి ఏ ఇతర మార్గం లేకపోతే అక్కడ ఇవ్వచ్చు. (ఇక్కడ తప్పనిసరి పరిస్థితులు అంటే ఫుకహా అనుమతించిన రెండు సందర్భాలు మాత్రమే అని గ్రహించాలి). కాని ఎవరికైతే లంచం తీసుకునే అలావాటు పడిపోయిందో వారు కనీసం ఈ వివరాలు తెలిసిన తరువాతైనా దీన్ని వదిలి ఇకపై లంచం తీసుకోము అని తోబా(క్షమాపణలు కోరాలి) చేసుకోవాలి మరియు వారి తోబా తప్పకుండా స్వీకరించబడుతుందని ఆశించాలి.

పాపపరిహారం-తోబా విధానం

చేసిన పాపం హక్కుల్లాహ్ అంటే అల్లాహ్‌కు సంబంధించినదైతే దాని నుంచి తోబా స్వీకరించబడాలంటే ఉలమా 3 షరతులు వ్రాశారు. అదే హక్కుల్ అబ్ద్ అంటే తోటి వానితో సంబంధించినదైతే ఈ మూడిటితో పాటు నాల్గవ షరతు కూడా పేర్కొన్నారు.

(1) చేసిన పాపం పై పశ్చాత్తాపం, బిడియ పడటం.

(2) వెంటనే అ పాప కార్యాన్ని శాస్వతంగా వదిలేయడం.

(3) మరోసారి దాని జోలికి వెళ్ళనని దృఢసంకల్పం చేసుకోవడం.

(4) కీడు కలిగిన వారికి నష్టపరిహారం చెల్లించడం లేదా వారి క్షమాపణ తీసుకోవడం.

లంచం హుకూకుల్ ఇబాద్‌కు సంబంధించింది కాబట్టి ఎవరినుంచైతే లంచం తీసుకున్నారో వారికి తిరిగివ్వడం వాజిబ్ (తప్పనిసరి). మరి దాని పద్ధతి ఉలమాలను సంప్రదించి తెలుసుకోవాలి. అల్లాహ్ యొక్క దాసులలో కొంత మందికి తోబా చేసే భాగ్యం కలిగితే వారు ఎంతో నిష్ఠతో ఈ డబ్బును వాటి యజమానులకు తిరిగిచ్చారు. నిజమైన సంకల్పం, దృఢమైన నిర్ణయం వుంటే అల్లాహ్ తప్పకుండా దారి చూపుతాడు.

వ మై యత్తకిల్లాహ్ యజ్‌అల్ లహూ మఖ్‌రజా (రద్దుల్ ముహ్తార్ 8/48)

ఇస్లామీ చరిత్ర-7

హజ్రత్ నూహ్ అలైహిస్సలామ్

